# పిలవండి వస్తాం

ఒకరోజు రాత్రి హరి, హరిత హ్యూస్టన్‌లో గల్లేరియా మాల్‌లో అటూ ఇటూ షాపుల్ని చూసుకుంటూ నెమ్మదిగా నడుస్తున్నప్పుడు, ఎదురయారు మధు, మాధవి.

మధు, మాధవీ తెలుగులో మాట్లాడుకుంటుంటే, హరి వాళ్ళని పలకరించాడు - "ఓ! మీరూ తెలుగువారేనా" అని.

నమస్కారాలూ, షేక్ హాండ్లూ, పరిచయాలూ అయాక అడిగాడు హరి "మీరు అమెరికా వచ్చి ఎన్నాళ్ళయింది?" అని.

"ఇరవై అయిదేళ్ళయిందనుకుంటాను" అన్నాడు మధు.

"మేంవచ్చి రెండు నెలలే అయింది. ఫలానా చోట వుంటాం. రండి ఎప్పుడయినా" అని ఫోన్ నెంబరూ, అడ్రసూ ఒక కాగితంమీద వ్రాసి ఇచ్చాడు హరి.

మధు తన బిజినెస్ కార్డ్ మీద ఇంటి ఫోన్ నెంబర్ వ్రాస్తుంటే, మాధవి హరితతో అంది "అలాగే! పిలవండి! తప్పకుండా వస్తాం" అని.

మధు తన కార్డు అందిస్తూ "మాధవి తర్వాత ఫోన్‌చేసి పిలుస్తుంది లెండి మా ఇంటికి వద్దురుగాని" అన్నాడు.

---

బొమ్మ: వాళ్ళు దూరంగా వెళ్ళిపోయాక హరిత, హరితో "అదేమిటండీ! ఇంటికి రమ్మని పిలుస్తుంటే. పిలవండి వస్తాం అంటారు. ఎదురుగుండా కనపడుతుంటే పిలవకుండా పిలుస్తాం వద్దురుగాని అంటారు. ఏమిటో అర్థంకారు. అయినా చూట్టానికి మంచివాళ్ళలాగానే వున్నారు మరి.." అంది ఏమీ అర్థం కాక. "అదే నాకూ అర్థం కావటం లేదు. కొంచెం పరిచయం పెరిగితే దగ్గరయిపోతాం..అంతే..." అన్నాడు హరి.

బొరుసు: "కొత్తగా వచ్చారు. మంచివాళ్ళలాగానే వున్నారు. ఒకసారి పిలుద్దాం" అంది మాధవి.

---

తర్వాత నెలరోజులకి తెలుగు అసోషియేషన్ ప్రోగ్రాంలో మళ్ళీ కలిశారు మధూ, హరీ పిచ్చాపాటీ మాట్లాడుకున్న తర్వాత, మాధవితో హరిత అంది "మా ఇంటికి రండి. ఎప్పుడయినా..." అని.

"అలాగే! పిలవండి. తప్పకుండా వస్తాం" అంది మాధవి.

---

బొమ్మ: హరిత మాధవిని వింతగా చూసింది.

బొరుసు: "ఈ నెలలో పెట్టుకుందామనుకున్న పార్టీలో ఇప్పటికే పాతిక ఫామిలీల యాయి. రెండో పార్టీలో వీళ్ళని పిలుద్దాం" అంది మాధవి, మధుతో.

---

మహాకవి శ్రీశ్రీని ఒకాయన అడిగాట్ట "మాకో నాటిక రాసి పెట్టండి" అని. బాగా బిజీగా వున్న శ్రీశ్రీ "అలాగే! రాస్తాను ఏ నాటికైనా" అన్నారుట.

* * *

ఒక శనివారం సాయంత్రం మాధవి, మధు బాగా బిజీగా వున్నారు.

మధు తన ఆఫీసు కొలీగ్స్-మార్టీ, లిండానీ, రాల్ఫ్, ఆలిసన్‌ని డిన్నర్‌కి పిలిచాడు. నలుగురూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటుంటే డోర్ బెల్ మోగింది.

మధు వెళ్ళి తలుపు తెరిచి, బయటికి తొంగి చూశాడు. హరి హరిత.

"ఇలా వెడుతుంటే మీఇల్లు ఇక్కడే అని గుర్తుకి వచ్చింది. కాస్త కాలక్షేపం అవుతుంది అని వెంటనే ఇటు వచ్చేశాం" అన్నాడు హరి.

మధు అదోలా నవ్వి, కొంచెం మొహమాట పడి "రండి. బట్.. వుయ్ హావ్ కంపెనీ ఫరవాలేదు రండి" అన్నాడు తలుపు ఇంకొంచెం తెరుస్తూ.

లోపలికి వస్తున్న హరి, మార్టీని, రాల్ఫ్‌ని చూసి పరిచయ పూర్వకంగా నవ్వాడు. పరిచయాలయాక అందరూ కూర్చున్నారు.

మాటల్లో పడబోతున్న హరితో హరిత నెమ్మదిగా "మనం వెడదాం. బిజీగా వున్నట్టున్నారు. ఇంకోసారి వద్దాం లెండి" అంది.

అవేమీ పట్టించుకోకుండా ఏదో అనబోతున్న హరి చేయి పట్టుకుని లేచి నుంచున్నది హరిత, కళ్ళతో అతన్ని వారిస్తూ.

అర్థం చేసుకున్న హరి "ఇంకోసారి తీరిగ్గా వస్తాం. మళ్ళీ మేము గ్రోసరీకి పోవాలి కూడాను. ఇప్పటికే ఆలస్యమయింది" అని బయల్దేరాడు.

మాధవి బయట తలుపు దాకా వచ్చి, "సారీ హరితా! ఒక చిన్న పార్టీ పెట్టుకున్నాం. ఇంకోసారి పిలుస్తాను. తప్పకుండా రండి" అంది నొచ్చుకుంటూ.

---

బొమ్మ: "ఛ. మనం ఇలా చెప్పకుండా రావటం ఏం బాగాలేదు. వాళ్ళని డిస్టర్బ్ చేశాం" అంది హరిత కొంచెం బాధ పడుతూ. "ఏం లేదు. మనం ఇండియాలో అందరిళ్ళకీ చెప్పే వెడుతున్నామా? వాళ్ళు ఖాళీగా వుంటే కాసేపు కూర్చుంటాం. లేకపోతే వచ్చేస్తాం ఇదీ అంతే" అన్నాడు హరి.

బొరుసు. ఆరాత్రే ఫోన్ చేసింది మాధవి "మిమ్మల్ని వుండమనలేదు. సారీ. మధు

కూడా మీరేమన్నా అనుకున్నారేమోనని బాధ పడ్డాడు. ఈ నెల ఇరవై ఎనిమిదో తారీఖు శనివారం, అంటే ఇవాల్టికి ఇరవై ఒక్కరోజులికి. మీరు ఖాళీగావుంటారా? మా ఇంట్లో పార్టీ పెట్టుకుంటున్నాం. మీరు తప్పకుండా రావాలి"అని వాళ్ళని "పిలిచింది" మాధవి.

---

నాలుగేళ్ళ తర్వాత, ఒకరోజు రాత్రి- హరి, హరిత గల్లేరియా మాల్‌లో అటూఇటూ షాపుల్ని చూసుకుంటూ నెమ్మదిగా నడుస్తున్నప్పుడు ఎదురయారు శ్యామ్, శ్యామల.

హరి, హరిత తెలుగులో మాట్లాడుకుంటుంటే, శ్యామ్ వాళ్ళని పలకరించాడు - "ఓ! మీరూ తెలుగువారేనా" అని.

నమస్కారాలూ, షేక్ హాండ్లూ, పరిచయాలూ అయాక అడిగాడు శ్యామ్ "మీరు అమెరికా వచ్చి ఎన్నాళ్ళయింది?" అని.

"అయిదేళ్ళయిందనుకుంటాను" అన్నాడు హరి.

"మేం వచ్చి రెండు నెలయింది. ఫలానా చోట వుంటాం. రండి ఎప్పుడయినా " అని ఫోన్ నెంబరూ, అడ్రసూ ఒక కాగితంమీద వ్రాసి ఇచ్చాడు శ్యామ్.

హరి తన బిజినెస్ కార్డ్ మీద, ఇంటి ఫోన్ నెంబర్ వ్రాస్తుంటే - హరిత, శ్యామలతో అంది, "అలాగే! పిలవండి! తప్పకుండా వస్తాం" అని.

హరి తన కార్డు అందిస్తూ, "హరిత తర్వాత ఫోన్‌చేసి పిలుస్తుంది లెండి. మా ఇంటికి వద్దురుగాని" అన్నాడు.

---

బొమ్మ: వాళ్ళు దూరంగా వెళ్ళిపోయాక - శ్యామల, శ్యామ్‌తో "అదేమిటండీ! ఇంటికి రమ్మని పిలుస్తుంటే పిలవండి వస్తాం అంటారు. ఎదురుగుండా కనపడుతుంటే పిలవకుండా, పిలుస్తాం వద్దురుగాని అంటారు. అయినా చూట్టానికి మంచివాళ్ళలాగానే వున్నారు మరి" అంది ఏమీ అర్థం కాక.

"అదే నాకూ అర్థం కావటం లేదు.. కొంచెం పరిచయం పెరిగితే దగ్గరయిపోతాం.... అంతే... " అన్నాడు శ్యామ్.

బొరుసు: ఒకనాటి బొమ్మ, ఇంకొన్నాళ్ళకి బొరుసు అవుతుంది.

* * *